ఘనంగా నిమజ్జనోత్సవం

- ప్రత్యేక పూజలు చేసిన భక్తులు
- మండపాల వద్ద అన్నదానాలు


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రతిష్ఠించిన వినాయకుని నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని భక్తులను ఉత్సాహపరిచారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం మండలంలోని పొల్లుగూడ, భగత్‌సింగ్‌నగర్ గ్రామాల్లో ఐదో రోజు గణేష్ ఉత్సవాలను ముగించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో కొలువుదీరిన మట్టి వినాయకుడి నిమజ్జన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు వినాయక నిమజ్జన శోభాయాత్రను భజన సంకీర్తనలతో నిర్వహించారు. అయ్యప్ప ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర ఎల్లమ్మకుంట వరకు సాగింది. ఎల్లమ్మకుంట వద్ద వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు.

నార్నూర్: గ్రామంలో అందరు ఐక్యంగా వినాయక ఉత్సవాలను జరుపుకోవాలని మాజీ సర్పంచ్ రాథోడ్ సావిందర్ అన్నారు. బుధవారం మండలంలోనీ మాన్కాపూర్ ఎస్సిగూడ వినాయక మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. తరతరాల నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరం యువతీ యువకులకు అందించాల్సిన అవసరం ఉందన్నారు.

బోథ్: బోథ్ మండలం మర్లపెల్లి గ్రామంలో భజన గణేష్ మండలి ఆధ్వర్యంలో గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా కొనసాగింది. గ్రామంలో భజన నిర్వహించే భజన మండలి వారు గణపతిని ప్రతిష్ఠించారు. బుధవారం గణేశ్ నిమజ్జనం నిర్వహించారు. నిమజ్జనంలో గ్రామంలో భజన చేస్తూ శోభాయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు రవీందర్, రాథోడ్ సికిందర్, గొల్ల బాబు, రమేశ్, గాండ్ల కిష్టయ్య, ఏసు గోదావరి, లక్ష్మి, గొల్లమాడ లక్ష్మి పాల్గొన్నారు.


ఇంద్రవెల్లి: పొల్లుగూడలో..


ఇచ్చోడ: వినాయక నిమజ్జన శోభాయాత్రలో..


బోథ్: భజన చేస్తున్న భజన మండలి సభ్యులు

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న డీఎస్పీ నాగేందర్


సభ్యులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

ఉట్నూర్‌రూరల్: పండుగలు అందరూ కలిసిమెలసి శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ అన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో హిందూ ఉత్సవ సమితి, గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. డీజే సౌండ్ లేకుండా చూసుకోవాలని సూచించారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో సీఐ మొగిలి, ఎస్సై మనోహర్ పాల్గొన్నారు.

బోథ్: గణేశ్ నిమజ్జనాన్ని ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని బోథ్ సీఐ రమేశ్, ఎస్సై ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ధన్నూర్, పొచ్చేర గ్రామాల్లో గణేశ్ మండపాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. రెడ్డి గణేశ్ మండలి వద్ద ప్రసాదం స్వీకరించారు. సీఐ, ఎస్సైలను శాలువాతో సత్కరించారు. పొచ్చేర గ్రామంలో భజన మండలి సభ్యులతో మాట్లాడారు.

ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి


స్టీల్ బ్యాంకును ప్రారంభిస్తున్న అధికారులు

సిరికొండ: మండలంలోని సుంకిడి గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్ అన్నారు. మండలంలోని సుంకిడి గ్రామంలో బుధవారం ఇందిరా మహిళ శక్తి పథకం కింద మండల మహిళ సమాఖ్య వారి సౌజన్యంతో స్టీల్ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని, వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఇందిరా మహిళ శక్తి పథకం ప్రారంభించిందన్నారు. స్టీల్ ఉపయోగంతో ప్లాస్టిక్ అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, సెర్ప్ ఏపీఎం సంతోష్ కుమార్, పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో ప్రతిష్ఠించిన వినాయకుడు మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న బుధవారం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకుడి ఆశీర్వాదంతో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. ఈ సంఘం సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు కాళ్ళ విఠల్, కోలా లింగన్న, ఈశ్వరిదాస్, తోట శివ్వన్న, బొడగం మమత, బండారి దేవన్న, కళమడుగుల సంతోష్, అంగిలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


దశరథ్‌ను సన్మానిస్తున్న ఎంపీ నగేశ్

బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన కచ్చకాయల దశరథ్ ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. కాగా బుధవారం ఎంపీ గోడం నగేశ్ ఆయన ఇంటికి వెళ్లి శాలువాతో సత్కరించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో విలువైనదని అన్నారు. అనంతరం కోట(కె), చింతలబోరి గ్రామంలో పర్యటించారు. బీజేపీ మండల అధ్యక్షుడు బోరె రవీందర్, సుభాష్ సూర్య, మురళి, రాజేశ్వర్, డిగోడే విష్ణు, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు పొందిన రాథోడ్ కవితను ఎంపీయూపీఎస్ ఉట్నూర్ ఉపాధ్యాయ బృందం ఆమె సన్మానించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు ఉదారాం, శ్రీనివాస్‌లను సత్కరించారు. పాఠశాల హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు

నార్నూర్: ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేస్తేనే ప్రత్యేక గుర్తింపు వస్తుందని నోడల్ అధికారి పవార్ అనిత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు కోరెంగ లక్ష్మణ్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రశంసా పత్రం అందుకున్న సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయుడిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిర్మల, జ్ఞానేశ్వర్, ఈశ్వర్, మారుతి, దేవిదాస్ పాల్గొన్నారు.

మహాసభ జయప్రదం చేయండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎదులాపురం: జిల్లా కేంద్రంలో ఈనెల 25న నిర్వహించనున్న ఐద్వా జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి లంక జమున అన్నారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో బుధవారం మహాసభ కరపత్రాలు ఆవిష్కరించారు. మహిళల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఐద్వా ముందుంటుందన్నారు. మహిళా చట్టాల అమలులో ప్రభుత్వాలు విఫలం అవుతుందన్నారు. ఇందుకు జైనూర్ ఘటననే నిదర్శనమన్నారు. ఆదివాసీ మహిళపై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శకుంతల, మంజుల, విజయ, లలిత పాల్గొన్నారు.

ప్రాంతీయ సదస్సు...

ఎదులాపురం: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 13న నిర్వహించే ప్రాంతీయ సదస్సు విజయవంతం చేయాలని ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట నారాయణ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కుమురం భీం భవనంలో బుధవారం మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సుభాష్, శేషారావు, నర్సింగ్, దేవి దాస్, అఖిల్ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

నార్నూర్: మండల కేంద్రంలోని జీన్‌గూడకు చెందిన రాజ్‌పంగే శంకర్ కుమారుడు రాజ్ పంగే చందు (18) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడంతో బుధవారం మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ పరామర్శించారు. అంత్యక్రియలకు ఆర్థికసాయం చేశారు. క్షణికావేశంలో ఎవరూ కూడా ఇటువంటి నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. ఆయన వెంట పెసా చట్టం కన్వీనర్ రాథోడ్ సీకేందర్, దుర్గే కాంతారావు, నర్సింగ్ మోరే, భానుదాస్, గుంజా చిన్నా, అరవింద్ ఉన్నారు.

ఉపాధ్యాయుడి మృతి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షీద్‌నగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్ బోధించే ఉపాధ్యాయుడు ఇఫ్తెఖార్ అలీ (59) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆయనకు భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుడికి డాక్టరేట్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో పీజీటీ బయాలజీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న మొకిరాల మహేశ్‌కు వృక్షశాస్త్ర విభాగంలో ఉస్మానియ విశ్వవిద్యాలయం డాక్టరేట్ అందచేసింది. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహేశ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యూనిస్ సలీం, ఉపాధ్యాయులు నవీన్ కుమార్, ముజాహిద్ సయ్యద్, ఇలియాస్ అలీ రాజశేఖర్ రెడ్డి, సుమన్, సంతోష్, ఉమాకాంత్, మహేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి


రోడ్డును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నార్నూర్: గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. బుధవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. మాలేపూర్ పరిధిలోని చిత్తగూడ గ్రామంలో ప్రజలతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి వెళ్లే రహదారిలో వాగుపై ఉన్న వంతెన గతంలో కొట్టుకుపోవడంతో సరైన రహదారి లేక కాలినడకన వెళ్తున్నామని గ్రామస్తులు వాపోయారు. స్పందించిన ఆమె అంతర్గత రహదారులు మంజూరు కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం భాబేఝరి పరిధిలోని చిత్తగూడ సమీపంలో ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయిన వంతెనను పరిశీలించారు. సుంగాపూర్‌లో పర్యటించి గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీటి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లోకండె దేవ్‌రావు, షేక్ హైమద్, పవార్ ఇందల్, మెట్టి బాపురావు, మెస్రం దిగంబర్, మర్సకోల నాందేవ్, ప్రేమ్ సింగ్, ఉమేష్, గజానన్ పాల్గొన్నారు.

బోథ్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన మహేశ్‌కుమార్ గౌడ్‌ను బోథ్ మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గొర్ల రాజు యాదవ్, అనిల్ అప్ప, షేక్ అబూద్ హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే వేదికల ఏర్పాటు


మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ నారాయణ

బోథ్: విద్యుత్ సమస్యల పరిష్కారానికే వేదికలు ఏర్పాటు చేస్తున్నామని విద్యుత్ శాఖ సీజీఆర్ఎఫ్ చైర్మన్ నారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో బోథ్, నేరడిగొండ, ఇచ్చోడ, బజార్‌హత్నూర్ మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారుల విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈసందర్భంగా ఆరుగురు విద్యుత్ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. మూడు దరఖాస్తులను అప్పటికప్పుడే పరిష్కరించగా.. మిగిలిన మూడు దరఖాస్తులను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఇటీవల పొచ్చేర గ్రామంలో విద్యుత్ తీగలు తగిలి యువకుడు మృతి చెందాడని మాజీ సర్పంచ్ మల్లేష్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. టెక్నికల్ సభ్యులు రామకృష్ణ, ఫైనాన్స్ సభ్యులు కిషన్, ఇండిపెండెంట్ సభ్యులు రాజా గౌడ్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులకు తాడిపత్రిల పంపిణీ


తాడిపత్రిలు పంపిణీ చేస్తున్న సభ్యులు

బేల: వరద బాధితులకు తాడిపత్రిలు పంపిణీ చేసి రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు వారి ఔదార్యాన్ని చాటుకున్నారు. వారం రోజుల క్రితం జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో కడ్కి గ్రామంలో ఆదివాసీ కుటుంబాలకు తాడిపత్రిలు పంపిణీ చేశారు. వారి సమస్యలు, పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ గంగేశ్వర్, సామ రూపేష్ రెడ్డి, విజయ్ బాబు, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఇంత నిర్లక్ష్యమా?



ఇచ్చోడ: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో చెట్టు విరిగిపోయి పదిరోజులు అవుతున్నా.. అధికారులు మాత్రం చెట్టును తొలగించడానికి చర్యలు తీసుకోకపోవడం లేదు. గత పదిరోజుల కిత్రం కురిసిన వర్షాలు, గాలితో ఆవరణలో ఉన్న భారీ చెట్ట విరిగిపడింది. చెట్టును తొలగించడానికి అధికారులు చర్యలు తొలగించకపోవడంతో కార్యాలయానికి వచ్చిన వారు ముక్కున వేలు వేసుకుంటున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

విజ్ఞానం.. గడ్డిపాలు



విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల ఆవరణలో రూ.30 లక్షలు వెచ్చించి సైన్స్‌పార్క్ ఏర్పాటు చేశారు. నిర్వహణ పట్టించుకోకపోవడంతో పార్క్‌లో పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. సైన్స్ పరికరాలు సైతం పనికి రాకుండా పోతున్నాయి. ఫలితంగా విద్యార్థులకు విజ్ఞానం పెంచాల్సిన ఈ సైన్స్ పార్క్ గడ్డిపాలైంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

సబ్ కలెక్టర్‌ను సన్మానించిన నాయకులు


సబ్ కలెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఇటీవల ఉట్నూర్ సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన యువరాజ్ మర్మాట్‌ను బుధవారం బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ నాయకులతో కలిసి ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువాతో సత్కరించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా రెవెన్యూ శాఖ నుంచి సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబా టైగర్, దూట మహేందర్, క్రాంతి, సాజిద్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న వీబీవో శ్రీనివాస్

తాంసి: ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వీబీవో శ్రీనివాస్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో అర్హులైన వికలాంగులకు ఉచిత బస్‌పాసులు అందజేశారు. అనంతరం గ్రామస్తులకు, పాఠశాల విద్యార్థులకు ఆర్టీసీ ద్వారా అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. వివాహాది శుభకార్యాలకు రాయితీపై బస్సులు, గమ్యం యాప్, రోడ్డు భద్రత నియమాలను వివరించారు. కార్యక్రమంలో వీబీవో మధు, కండక్టర్ భూమన్న, పాఠశాల హెచ్‌ఎం శ్రీకాంత్ పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన 'కంది'


జ్ఞాపిక అందజేస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. మహేశ్‌కుమార్ గౌడ్ నాయకత్వంలో ఆయన మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకుంటానని తెలిపారు. ఆయన ఆదేశాలనుసారం క్యాడర్‌కు తగిన దిశానిర్దేశం చేస్తూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తానని అన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

తాంసి: భీంపూర్ మండలంలోని ధనోర ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సురేశ్‌ను బుధవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థి యశ్వంత్‌ను సోమవారం పాఠశాల ఆవరణలో పాముకాటు వేసిన విషయం తెలిసిందే. ఉపాధ్యాయుడు సురేశ్ ప్రాణహాని జరగకుండా నోటి ద్వారా పాము విషాన్ని బయటకు తీసి కట్టుకట్టాడు. విద్యార్థి ప్రాణాలను రక్షించిన ఉపాధ్యాయుడిని గ్రామస్తుల అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మహేందర్, అజయ్, గ్రామపెద్దలు శంకర్, బక్కి మురళీ, శివ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం


సమావేశమైన పాలకవర్గం

బోథ్: బోథ్ మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశాన్ని బుధవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా రానున్న రోజుల్లో పంటల కొనుగోళ్ల గురించి చర్చించారు. మార్కెట్ కమిటీ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై చర్చించి, తీర్మానం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మెన్ ఆడే వసంత్, కత్తూరి మల్లేష్, కత్తూరి విశ్వనాథ్, సభ్యులు పాల్గొన్నారు.

జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అశోక్‌రెడ్డి


అశోక్‌రెడ్డి

జైనథ్: జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అల్లూరి అశోక్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. తనకు ఈ పదవి కట్టబెట్టినందుకు ప్రభుత్వానికి, కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేషనల్ క్రైమ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఇమ్రాన్


ఇమ్రాన్

ఇచ్చోడ: మండలంలోని మాదపూర్ గ్రామానికి చెందిన ఇమ్రాన్ నేషనల్ క్రైమ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ.. సంస్థ జాతీయ అధ్యక్షుడు అమన్ గుప్తా నాపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు. సంస్థ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.